సాక్షి
నల్లగొండ
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



శిలాఫలకం ధ్వంసం
పార్వతీపురం పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలాకాన్ని దుండగులు ధ్వంసం చేశారు. - 8లో



ఇలా.. గుర్తు'పట్టు'
నకిలీ పట్టును గుర్తు పట్టేందుకు కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సిల్క్ మార్క్, హ్యాండ్లూమ్ మార్క్ అందజేస్తుంది. - 8లో



నోరు అదుపులో పెట్టుకో
నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని జగదీష్‌రెడ్డికి మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సూచించారు. - 10లో

న్యూస్‌రీల్

కోదండరాం ఎమ్మెల్సీ పదవిపై కేసీఆర్ కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : టీజేఎస్ నాయకుడు, ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయకుండా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కుట్రలు చేశారని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆది నుంచి కోదండరాంపై కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని, కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి రాకుండా కేసీఆర్ చేసిన కుట్రలు ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఆంజనేయులు, నర్సింహా, ప్రవీణ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పనులు ఇవ్వాలని ఎస్‌ఈకి వినతి



ఎస్‌ఈకి బొకే అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్లు

నల్లగొండ : నల్లగొండ విద్యుత్ శాఖ ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్స్‌కు నిబంధనల ప్రకారం పనులు ఇవ్వాలని ఎస్‌ఈ చంద్రమోహన్‌కు కాంట్రాక్టర్లు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్స్‌కు కొంతకాలంగా కిందిస్థాయి అధికారులు పనులు ఇవ్వకుండా నిర్లక్ష్య సమాధానం చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం మండలాల వారీగా పనులు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని ఎస్‌ఈని కోరారు. కార్యక్రమంలో రుద్రాక్షి రవి, నామ రవిచంద్ర, పరమేశం, దాసరి నరేందర్, ప్రవీణ్, పాపకంటి సైదులు, ఏర్పుల వెంకన్న, లక్పతినాయక్, హనుమానాయక్, కృష్ణ, చింతపల్లి కృష్ణ, కొత్తపల్లి సుధాకర్, యాదగిరి పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

చండూరు : మండలంలో ఇడికూడ గ్రామ చెరువును మైనింగ్, విజిలెన్స్, ఇరిగేషన్ శాఖల అధికారులు బుధవారం పరిశీలించారు. చర్లగూడెం ప్రాజెక్ట్ పేరుతో ఈ చెరువు నుంచి కొంతకాలంగా మట్టిని తరలిస్తూ పక్కదారి పట్టిస్తున్నారని ఇటీవల కొంతమంది ఫిర్యాదు చేయడంతో అధికారులు చెరువు వద్ద తనిఖీలు చేపట్టారు. చెరువు మట్టి ఎక్కడికి తరలుతుందని అనే విషయాన్ని గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చెరువు నుంచి ఇప్పటి వరకు ఎంత మట్టిని తరలించారో చెప్పలదేని.. ఎలాంటి అనుమతి పత్రాలు చూపలేదని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి త్వరలోనే పైఅధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ బాలకృష్ణ, అధికారులు రాంబాబు, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలు

భువనగిరిటౌన్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌కుమార్ సేన్ పిలుపునిచ్చారు. హనుమకొండలో జరుగుతున్న సీఐటీయూ ఆలిండియా వర్కింగ్ కమిటీ సమావేశాలకు వెళ్తూ భువనగిరిలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె తలపెట్టినట్లు వెల్లడించారు. ఈ సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- ఈ నెల 15వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు

నల్లగొండ : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం వేళల్లో రెండు విడతలుగా పరీక్షలు జరగనున్నాయి. సైన్స్‌లో ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మాత్రమే ప్రాక్టికల్స్ జరుగుతుండగా ఒకేషనల్‌లో మాత్రం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్ష రాయనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ప్రాక్టికల్స్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు.

అధికారుల నియామకం..

ప్రాక్టికల్స్‌కు సంబంధించి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 12,779 మంది రాయనుండగా, ఒకేషనల్ విభాగంలో ఫస్టియర్ 1,486, సెకండియర్‌లో 1,318 మంది పరీక్షలు రాయనున్నారు. సైన్స్ విభాగం కోసం 83 ఒకేషనల్ విభాగానికి 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 104 మంది డిపార్టుమెంటల్ అధికారులను, 104 మంది చీఫ్ సూపరింటెండెంట్లతోపాటు డీఈసీ కమిటీని, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశారు.



నల్లగొండలోని ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈఓ దస్రూనాయక్

స్వశక్తితో ఎదగాలి

నకిరేకల్ : నిరుద్యోగులు స్వశక్తితో ఎదగాలని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి పద్మ అన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖ సంకల్ప్ పథకంలో భాగంగా నకిరేకల్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ డైరెక్టరేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిరుద్యోగ యువతకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిక్షణ పొందినవారికి ప్రశంసా పత్రాలు, బ్యాగులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు అమరేశ్వరీ, సయ్యద్ అబ్దుల్‌ఖాదర్, జిల్లా సమన్వయకర్త ఎర్ర శివరాజ్, రిసోర్స్ పర్సన్ వెంకట్, యాతాకుల సునీల్, జిల్లా శాంసన్, ఈదులు యాదగిరి, జానకిరాములు, ఆదిమల్ల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలనకు రెడీ

- నేటితో ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం
- ప్రభుత్వానికి చేరిన ప్రత్యేక అధికారుల జాబితా
- నేడు విడుదల కానున్న జీఓ
- పంచాయతీల్లో అత్యవసర పనులకే అవకాశం



శాలిగౌరారం మండలం అడ్లూరు పంచాయతీ పాలకవర్గానికి సన్మానం చేస్తున్న నాయకులు

నల్లగొండ : గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గురువారంతో ముగియనుంది. 2వ తేదీ నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. జిల్లా యంత్రాంగం ఆయా పంచాయతీల్లో నియమించే ప్రత్యేక అధికారుల జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి పంపింది. ప్రత్యేక పాలనకు సంబంధించి గురువారం ప్రభుత్వం నుంచి జీఓ విడుదలయ్యే అవకాశం ఉంది. పంచాయతీల్లో ఏ విధంగా ప్రత్యేక అధికారులు పాలన నిర్వహించాలనే దానిపై జీఓ ద్వారా స్పష్టత రానుంది.

2019 జనవరిలో ఎన్నికలు

గ్రామ పంచాయతీలకు 2019 జనవరి మాసంలో ఎన్నికలు జరిగాయి. మూడు విడతలుగా ఎన్నికలు పూర్తి చేసిన అనంతరం ఫిబ్రవరి 2వ తేదీన పంచాయతీల్లో పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం చేసి కొలువుదీరాయి. 2024 ఫిబ్రవరి 1వ తేదీతో ఐదు సంవత్సరాలు కావడంతో వారి పదవీకాలం పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం పదవీకాలం పూర్తికాకముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల సంఘం అందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం ముందుకు రాలేదు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున దాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 21 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులు ఖాళీగా ఉన్నాయి. నకిరేకల్ మండలంలో ఏడు గ్రామ పంచాయతీల్లో గతంలో ఎన్నికలు నిర్వహించలేదు. ఇక్కడ ఇప్పటికే ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఇక మిగిలిన 14 గ్రామ పంచాయతీల్లో కొందరు సర్పంచ్‌లు రాజీనామా చేయగా మరికొందరు చనిపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇక్కడ ఉప సర్పంచ్‌లు సర్పంచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఈ అన్ని పంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించనున్నారు. 2వ తేదీ నుంచి ఈ పంచాయతీల్లోనూ ప్రత్యేక పాలన సాగనుంది.

అత్యవసర పనులే..!

పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనలో శాశ్వత పనుల నిర్వహణకు పెద్దగా అవకాశం ఉండదు. ప్రధానంగా ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అత్యవసరమైన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి లైట్లు, డ్రెయినేజీ తదితరల పనులు నిర్వహించాల్సి ఉంటుంది. పెద్ద పనులైతే టెండర్ల ద్వారా చేపట్టాల్సి ఉంటుంది. గతంలో మూడు గ్రామాలకు ఒకరు ప్రత్యేక అధికారిగా వ్యవహరించగా.. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గూడేలను, తండాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసి అన్ని పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రస్తుత ప్రభుత్వం అదే తరహాలో ప్రతి పంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించనుంది.

యాసంగి సాగు 4.01 లక్షల ఎకరాలు

- తప్పిన వ్యవసాయశాఖ అంచనా
- బోర్లు, బావుల ఆధారంగానే పంటల సాగు
- అడుగంటిన భూగర్భ జలాలు
- సాగు చేసిన పంటలు చేతిరావడం కష్టమే..



యాసంగిలో పంటల సాగు ఇలా..

పంట	ఎకరాలు
వరి	3,79,696
వేరుశెనగ	17,715
జొన్న	1069
మొక్కజొన్న	101
ఆముదం	174
మినుము	472
బొబ్బెర	304
పెసర	1684
ఉలువ	49
మొత్తం	4,01,264

నల్లగొండ అగ్రికల్చర్ : యాసంగి పంటల సాగు సీజన్ ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 5.81 వేల ఎకరాల్లో యాసంగి పంటలు సాగు కానున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. కానీ జిల్లా వ్యాప్తంగా 4,01,264 ఎకరాల్లోనే వివిధ పంటలు సాగయ్యాయి. వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటడం, ఏఎమ్మార్పీ, నాగార్జునసాగర్, డిండి ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల లేని కారణంగా సాగు గణనీయంగా పడిపోయింది. గత వానాకాలంలో కూడా సాగునీటి విడుదల లేకపోవడం, కేవలం తాగునీటి అవసరాలకే నీటిని విడుదల చేయడం, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. దీంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి.

తీవ్ర వర్షాభావ పరిస్థితులు

జిల్లాలో సాగునీటి వనరులైన నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, డిండి ప్రాజెక్టుల ద్వారా ప్రతి సీజన్‌లో సాగు నీటిని విడుదల చేస్తారు. ఈ సారి వర్షాభావ పరిస్థితుల కారణంగా నీరు విడుదల చేయలేదు. కేవలం బోర్లు, బావుల ఆధారంగానే పంటలు సాగు చేశారు. ప్రస్తుతం భూగర్భ జలాలు కూడా అడుగంటాయి. బోర్లు సగానికి సగం నీరు కూడా రావడం లేదు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వరి చేలు పొట్ట దశకు వచ్చి నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. ఆ పరిస్థితుల్లో నీరందకపోతే వరి చేలు ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరి నాట్లు వేసుకున్నారు. ప్రస్తుతం పరిస్థితులను బట్టి పెట్టుబడులు కూడా వస్తాయో రావో అని ఆందోళన చెందుతున్నారు.

బోర్లు పోయడం లేదు

బోర్లు సక్రమంగా పోయడం లేదు. వానాకాలంలో మంచిగా పోసిన బోర్లు ఇప్పుడు సగం కూడా పోయడం లేదు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వరి చేలకు నీరు ఎక్కువగా అవసరం. ఇప్పుడు బోర్లు పోయకపోతే నాటు వేసిన వరి చేలు ఎండిపోతాయి.

– వెంకన్న, రైతు, నిడమనూరు

గందరగోళంలో పట్టభద్రులు!



- ఎమ్మెల్సీ ఓటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న గ్రాడ్యుయేట్లు
- ఆర్డీఓ ఆఫీస్‌కు వచ్చి ధ్రువపత్రాలు ఇవ్వాలని ఫోన్లు చేస్తున్న అధికారులు
- అవసరం లేదంటున్న ఎలక్షన్ సెల్ అధికారులు

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదు విషయంలో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రులను ఆఫీస్‌కు వచ్చి ధ్రువపత్రాలు (గెజిటెడ్ ఆఫీసర్ సంతకం కలిగిన ఓటరు ఐడీ, డిగ్రీ మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు) ఇవ్వాలని అధికారులు ఫోన్ చేసి చెబుతున్నారు. దీంతో పట్టభద్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక మళ్లీ ధ్రువపత్రాలు ఇవ్వాలని కోరడమేంటని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి 2020 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తయిన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అవకాశం ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత సిబ్బందే దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పట్టభద్రుడా కాదా అనేది సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉంది. కానీ, ఆన్‌లైన్‌లో చేసుకున్న వారిని కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలని ఫోన్లు చేస్తుండడంతో పట్టభద్రులు కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్లు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. ఇంత మాత్రానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం దేనికని పట్టభద్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎలక్షన్ సెల్ అధికారులు మాత్రం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు సమర్పించాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

దరఖాస్తులు 2లక్షల పైచిలుకు..

మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 5,05,565 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోగా 3,85,996 మంది (76.35శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఈ మూడు ఉమ్మడి జిల్లాల్లో బుధవారం వరకు 2,30,780 మంది ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 98 శాతం ఆన్‌లైన్‌లో చేసుకున్న వారే ఉన్నారు. ఈనెల 6వ తేదీ వరకు గడువు ఉండడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా తిరిగి కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులే విచారణ చేస్తారు

వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లను ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాల్సిన అవసరం లేదు. సంబంధిత సిబ్బంది వారి అడ్రస్‌కు వెళ్లి విచారణ చేస్తారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను మాత్రం ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలి.

– విజయ్, ఎలక్షన్ సెల్ డీటీ, నల్లగొండ

గురుకుల కళాశాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిట్ సభ్యులు

దేవరకొండ : దేవరకొండ మండలంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ డిగ్రీ గురుకుల కళాశాలను బుధవారం ఎంజీ యూనివర్సిటీ అకడమిక్ ఆడిట్ బృందం సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్స్, విద్యార్థులు ప్రవేశాల నమోదుతోపాటు అకడమిక్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అంజిరెడ్డి, రవి, ప్రశాంతి, జయంతి కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి ఉన్నారు.

చెంచులను అభివృద్ధిలోకి తేవాలి

నల్లగొండ : చెంచులను అభివృద్ధిలోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ (పీఎం–జన్‌మన్) కార్యక్రమం కింద చెంచు హ్యాబిటేషన్లలో చేపట్టే కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని తిరుమలగిరి సాగర్, చందంపేట, గుండ్లపల్లి, నేరెడుగొమ్ము మండలాల పరిధిలోని నెల్లికల్, చిత్రియాల, గోనబోయినపల్లె, కంబాలపల్లి, రేకులవలయం, పొగిళ్ల, తిమ్మాపూర్, గన్నేరులపల్లిలో చెంచు జనాభాకు ఆయా శాఖల ద్వారా సంక్షేమ కార్యక్రమాలు అందేలా చూడాలన్నారు. పథకం కింద 281 కుటుంబాలకు ఉపాధి హామీ జాబ్ కార్డులు వెంటనే అందచేయాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం మంజూరు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, ఆర్డీఓలు రాములు, చెన్నయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు సంస్థల కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

రైలు కూత.. ఎందాక!



ఎంఎంటీఎస్ పొడిగింపు జరిగే యాదాద్రి రైల్వే స్టేషన్



నడికుడి మార్గంలో బీబీనగర్ మండలం పగిడిపల్లి వద్ద జంక్షన్

రైల్వే ప్రాజెక్టులకు నిధుల లేమి

- బీబీనగర్ – నడికుడి డబ్లింగ్ సర్వేలతోనే సరి
- యాదాద్రికి చేరని ఎంఎంటీఎస్
- సికింద్రాబాద్– కాజీపేట మూడో లైన్ ఊసే లేదు
- నేడు కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌పై ప్రజల ఆశలు

సాక్షి, యాదాద్రి: కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెడుతున్న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు ప్రాధాన్యత లభిస్తుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. 2023 బడ్జెట్‌లో జిల్లా ప్రాజెక్టులకు పూర్తి స్థాయి నిధుల కేటాయింపు జరగలేదు. దీంతో రైల్వే ప్రాజెక్టులు నిలిచిపోయాయి. బీబీనగర్–నడికుడి మార్గంలో డబ్లింగ్ (రెండో లైన్) పనుల సర్వేకు రూ.60 కోట్లు కేటాయించిన కేంద్రం, యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపునకు, సికింద్రాబాద్–కాజీపేట మూడోలైన్‌కు నిధులు కేటాయించ లేదు. బీబీనగర్– నడికుడి (గుంటూరు) మార్గంలో పగిడిపల్లి నుంచి–నడికుడి వరకు ఉన్న సింగిల్ లైన్‌ను డబుల్ లైన్‌గా మార్చడానికి గత బడ్జెట్‌లో కేంద్రం రూ.60 కోట్లు మంజూరు చేసింది. ఈ మార్గంలో 248 కిలో మీటర్ల సింగ్ లైన్‌ను డబుల్ లైన్‌గా మార్చాలి. అయితే, గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సర్వేకే సరిపోయాయి. పూర్తి స్థాయి డబ్లింగ్ పనులకు అవసరమయ్యే నిధులు కోసం అధికారులు నివేదిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపారు.

ఎంఎంటీఎస్ ముందుకు సాగేనా..

ఎంఎంటీఎస్‌ను యాదాద్రి వరకు పొడిగిస్తామన్న హామీ నెరవేరడం లేదు. ఘట్కేసర్ వరకే ఉంది. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా చేపట్టాయి. సికింద్రాబాద్–కాజీపేట మార్గంలో ఘట్కేసర్ వరకు ఉన్న ఎంఎంటీఎస్ రైలును యాదాద్రి వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ 2016–17లో నిర్ణయం తీసుకుంది. 33 కిలోమీటర్ల మార్గంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత ఈ ప్రాజెక్టును పూర్తిగా కేంద్రమే పూర్తి చేయడానికి నిర్ణయించినప్పటికీ 2023 బడ్జెట్‌లో మాత్రం మొండిచేయి చూపించారు. ఎంఎంటీఎస్ చర్లపల్లి వరకు మొదటి దశ, ఘట్కేసర్ వరకు రెండో దశ, రాయగిరి వరకు మూడో దశ పనులను చేపట్టాలని నిర్ణయించారు. ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి రైల్వే స్టేషన్ (రాయగిరి) వరకు సర్వేతోనే సరిపెట్టారు. చర్లపల్లి నుంచి ఘట్‌కేసర్ వరకు పనులు సాగుతున్నాయి. ప్రపంచస్థాయి పుణ్యక్షేత్రంయాదాద్రి భక్తుల సౌకర్యంకోసం ఎంఎంటీఎస్ ఉపయోగపడనుంది. 2016–17 బడ్జెట్‌లో కేంద్రం ఆమోదం తెలుపగా 2020 డిసెంబర్‌నాటికి పూర్తి కావాలి. ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి మార్గానికి రూ.330 కోట్ల వ్యయమవుతుందని తొలుత అంచనా వేశారు. ఏడు సంవత్సరాల తర్వాత ఆ అంచనాలు పెరిగాయి.

మూడో లైను ముచ్చట ఏదీ..

సికింద్రాబాద్ –కాజీపేట మార్గంలో మూడో లైన్‌కు నిధుల కేటాయింపు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెరుగుతున్న రైళ్ల రద్దీని తట్టుకోవడానికి ప్రస్తుతం ఉన్న డబుల్ లైన్‌కు అదనంగా మూడో లైన్ కోసం పదిహేనేళ్ల క్రితం సర్వే పూర్తి చేశారు. సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా ఉత్తర, తూర్పు, దక్షిణ భారత దేశంలోని పలు ప్రాంతాలకు ప్రతిరోజు ప్రయాణికుల రైళ్లు, సరుకు రవాణా రైళ్లు నడుస్తున్నాయి. విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ తో ప్రయాణికుల రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న రెండు లైన్లకు అదనంగా మరో ట్రాక్ కోసం సర్వే చేశారు. మూడో లైన్ ప్రతిపాదనలు సిద్ధం చేసినా నిధులు మాత్రం మంజూరు కావడం లేదు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్



నల్లగొండ : సదరం ధ్రువీకరణ పత్రం పొందాలనుకునే దివ్యాంగులు గురువారం నుంచి మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీఓ కాళిందిని ఒక ప్రకటనలో సూచించారు. సదరం క్యాంపుల షెడ్యూల్‌ను బుధవారం ఆమె విడుదల చేశారు. స్లాట్ బుక్ చేసుకున్నవారు ఆన్‌లైన్ ద్వారా పొందిన రసీదుల ఆధారంగా నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోజూ ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంటలోపు నిర్వహించే క్యాంపులకు హాజరు కావాలని పేర్కొన్నారు.

షెడ్యూల్ ఇలా..

- దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లోని మండలాల్లో శారీరక వైకల్యం గల వారికి ఫిబ్రవరి 2,5,16,19,24, మార్చి 1,4,16,22,26 తేదీల్లో, బుద్ధి మాంద్యం గలవారికి ఫిబ్రవరి 6, మార్చి 5 తేదీల్లో, కంటి రుగ్మతలు గల వారికి ఫిబ్రవరి 7, మార్చి 6 తేదీల్లో, వినికిడి లోపం గల వారికి ఫిబ్రవరి 8, మార్చి 14 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు.
- మునుగోడు, నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాలు, శాలిగౌరారం మండలానికి చెందిన శారీరక వైకల్యం గల వారికి ఫిబ్రవరి 3,12,17,22,26, మార్చి 2,11,18,23,30వ తేదీల్లో, బుద్ధి మాంద్యం గలవారికి ఫిబ్రవరి 20, మార్చి 19 తేదీల్లో, కంటి రుగ్మతలు గల వారికి ఫిబ్రవరి 21, మార్చి 20 తేదీల్లో, వినికిడి లోపం గల వారికి ఫిబ్రవరి 15, మార్చి 21 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ టౌన్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణం కృష్ణమానస కాలనీలో నివాసం ఉంటున్న తూడి వెంకట్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నకిరేకల్‌కు వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని వెంకట్‌రెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు.బీరువాలో దాచిన రూ.4వేలతో పాటు ఐదు గ్రాముల బంగారాన్ని అపహరించుకుపోయారు. వెంకట్‌రెడ్డి బుధవారం ఇంటికి తిరిగి రాగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సతీష్‌వర్మ తెలిపారు.

బాలుడి అప్పగింత

భువనగిరి క్రైం: రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన బాలుడిని పోలీసులు సంరక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లోకేష్(12) కుటుంబ సభ్యులు కొన్నేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్థిరపడ్డారు. ఇటీవల అతడి తల్లి అనారోగ్యం బారిన పడడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. తల్లిని చూసేందుకు గాను లోకేష్, తన సోదరి హిమాద్రితో కలిసి బుధవారం భద్రాచలం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరారు. మార్గమధ్యలో భువనగిరి రైల్వేస్టేషన్ రైలు నిలిపారు. ఈ క్రమంలో లోకేష్ రైలు దిగి స్టేషన్‌లోని వాష్‌రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి రైలు వెళ్లిపోయింది. స్టేషన్‌లో ఒంటరిగా బాలుడు లోకేష్ రోదిస్తుండగా రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు, సత్యనారాయణ, ఉమెన్ కానిస్టేబుల్స్ గమనించారు. అతడిని విచారించగా వివరాలు వెల్లడించారు. ఫోన్ ద్వారా లోకేష్ సోదరి హిమాద్రికి పోలీసులు సమాచారం ఇచ్చారు. ఆమె తిరిగి భువనగిరి రైల్వేస్టేషన్‌కు రాగా లోకేష్‌ను అప్పగించారు.

కాలువలో పడి ఒకరి మృతి



శ్రీనివాస్ మృతదేహం

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలోని నిజాంసాగర్ కాలువలో పడి సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన పింగిళి శ్రీనివాస్(45) మృతిచెందాడు. బతుకుదెరువు నిమిత్తం గ్రామానికి వలస వచ్చిన శ్రీనివాస్ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం మద్యం మత్తులో కాలువలో జారిపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చిన్న గంగారాం పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండక్రైం: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింక్‌లను నిశితంగా పరిశీలించాలన్నారు. ఫేస్‌బుక్, ఫ్రెండ్స్ రిక్వెస్టు తెలియని వారివి కన్‌ఫర్మ్ చేయవద్దన్నారు. సైబర్ క్రైం జరిగినప్పుడు 8712665575, 8712665625 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఘన శ్యామ్, సీఐ నాగార్జున, టూటౌన్ ఎస్ఐ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు మంజుల, రాజారామ్, జ్యోతి, శైలజ, సరిత, వనజ పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థినులు

ఇలా..గుర్తుపట్టు



పోచంపల్లి ఇక్కత్ చీరను ధరించిన యువతి



ఇక్కత్ పట్టు వస్త్రాలు

- స్వచ్ఛమైన పట్టు వస్త్రాలకు క్యూఆర్ బార్‌కోడ్‌తో కూడిన సిల్క్ మార్క్
- మగ్గంపై నేసిన పట్టుకు హ్యాండ్లూమ్ మార్క్ ఉంటుంది
- నకిలీ పట్టు పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి
- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సూచన

భూదాన్‌పోచంపల్లి : శుభకార్యం ఏదైనా వధూవరులు, మహిళలు, పురుషులు, పిల్లలు అని తేడా లేకుండా అందరూ పట్టు వస్త్రాలను ధరించడం సాంప్రదాయంగా భావిస్తారు. పట్టు వస్త్రాలు ధరించడం వల్ల హుందాతనం, అందం ఉట్టిపడుతుంది. దీంతో మార్కెట్లో పట్టు వస్త్రాలకు మంచి ధర, డిమాండ్ ఉంది. వస్త్ర దుకాణాల్లో లైట్ల వెలుగులో పట్టు వస్త్రాలు దగదగా మెరుస్తుంటాయి. కానీ, అందులో ఏది అసలు, ఏది నకిలీ పట్టు వస్త్రమనేది వినియోగదారులు కనిపెట్టడం చాలా కష్టం. వస్త్ర దుకాణాదారులు కూడా వినియోగదారుడిని బురిడీ కొట్టించే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల హైదరాబాద్, వరంగల్, నల్లగొండ తదితర ప్రాంతాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో నకిలీ పట్టువస్త్రాలు పట్టుబడ్డాయి. తాజాగా పోచంపల్లిలో సైతం ప్రింటెడ్ చీరలు విక్రయిస్తున్నారని సమాచారంతో అధికారులు అకస్మికంగా దాడులు నిర్వహించి పలువురి వ్యాపారులకు నోటీసులు అందజేశారు. అందుకే కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ స్వచ్ఛమైన పట్టు వస్త్రాలకు క్యూఆర్ బార్‌కోడ్‌తో కూడిన సిల్క్ మార్క్, మగ్గంపై నేసిన వస్త్రాలకైతే హ్యాండ్లూమ్ మార్క్‌ను అందజేస్తుంది. సిల్క్ మార్క్, హ్యాండ్లూమ్ మార్క్ లేబుల్ ఉన్నట్లయితే అది స్వచ్ఛమైనదిగా గుర్తించవచ్చు. రిజిస్ట్రేషన్ చేసుకొన్న వస్త్ర వ్యాపారులకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి లోగోలను అందజేస్తారు.



మల్బరీ పట్టు నూలు

పట్టులో పలు రకాలు

పట్టులో అనేక రకాలున్నాయి. అందులో సహజసిద్ధమైన మల్బరీ సిల్క్‌ను 'క్వీన్ ఆఫ్ టెక్స్‌టైల్'గా పిలుస్తారు. ఇది మల్బరీ పట్టు పురుగైన బాంబేక్స్ మోరె నుంచి తయారవుతుంది. ఇది చాలా ఖరీదైనది. ప్రపంచ వ్యాప్తంగా దీనిని 90 శాతం వినియోగిస్తున్నారు. పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలన్నీ మల్బరీ పట్టుతోనే తయారవుతున్నాయి.

అసలైన పట్టును ఇలా గుర్తించవచ్చు

- పట్టు పోగుని వెలిగించినప్పుడు నిరంతరంగా కాలకుండా ఆరిపోతుంది.
- పట్టు కాలినప్పుడు వెంట్రుకలు, ఈకలు కాలిన వాసన వస్తుంది.
- పోగు కొనలో చిన్న నల్లపూసలా మారుతుంది.
- పూసను నలిపినప్పుడు పొడి అయ్యి పోగు గరుకుగా మారుతుంది.
- పట్టు వస్త్రాలను ఎల్లప్పుడు సిల్క్‌మార్క్ అధీకృత షాపుల్లోనే కొనాలి.
- పట్టు వస్త్రాలకు ఉన్న సిల్క్‌మార్క్ లేబుల్ 100 శాతం పట్టు ప్రామాణికతను సూచిస్తుంది.
- పట్టు వస్త్రాలని సిల్క్‌మార్క్ వారిచే ఉచితంగా పరీక్షింప జేసుకోవచ్చు.

- 'టస్సార్ సిల్క్' కాపర్‌రంగులో ఉంటుంది. అడవుల్లో ఉండే పట్టు పురుగుల నుంచి తయారు చేస్తారు. టస్సార్ పట్టును ఎక్కువగా హోం ఫర్నీషింగ్, ఇంటీరియర్ డెకరేషన్‌లో వినియోగిస్తారు.
- ఇందీ పట్టు పరుగుల నుంచి 'ఈరీ సిల్క్' తయారవుతుంది. ఈరీ పట్టును కాటన్, ఉన్ని, జనపనారతో కలిపి ఫ్యాషన్, ఇతర అస్సెసరీస్, హోం ఫర్నీషింగ్ తయారు చేస్తారు.
- 'ముంగా పట్టు' బంగారు వర్ణంలో ఉంటుంది. దీనిని తయారు చేసే పట్టు పురుగులు అడవుల్లో ఉంటూ సోమ్ అండ్ సోఆలు అనే చెట్ల ఆకులను తింటాయి.



హ్యాండ్లూమ్ మార్క్, సిల్క్ మార్క్ లోగోను చూపిస్తున్న అధికారులు

సిల్క్ మార్క్ చూసి కొనుగోలు చేయాలి



సిల్క్ మార్క్ అనేది పట్టు వస్త్రాలకు భద్రత లాంటిది. వినియోగదారులు ఎల్లప్పుడూ క్యూఆర్ బార్‌కోడ్‌తో కూడిన సిల్క్ మార్క్ ఉందా లేదా చూసి వస్త్రాలను కొనుగోలు చేయాలి. బార్‌కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేస్తే షాపు వివరాలు తెలిసిపోతాయి. దరఖాస్తు చేసుకొంటే పరిశీలించి వస్త్ర వ్యాపారులకు సిల్క్ మార్క్‌ను అందజేశాం.

– వై.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా.

స్వచ్ఛతకు హ్యాండ్లూమ్ మార్క్



ప్రభుత్వం ధ్రువీకరించిన సిల్క్, హ్యాండ్లూమ్ మార్క్‌తో పాటు ఇండియన్ హ్యాండ్లూమ్ బ్రాండ్ ట్యాగ్ కల్గిన వస్త్రాలనే కొనాలి. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా వస్త్రాలను కొనుగోలు చేసే వినియోగదారులు వీటిని ధ్రువీకరించుకొని కొనాలి. కోల్‌కతా, గుజరాత్, హైదరాబాద్ లాంటి నగరాలలో కొందరూ అక్రమార్కులు పోచంపల్లి ఇక్కత్ డిజైన్‌లను కాపీచేసి విక్రయిస్తున్నారని మా దృష్టికి వచ్చింది. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి.– ఎం.వెంకటేశం, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు

- భూ సారం, రోగనిరోధక శక్తి పెరుగుతుంది
- బెండ సాగుకు ఇదే అనువైన సమయం
- హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్



సాగులో ఉన్న బెండ పంట

నడిగూడెం : రైతులు బెండసాగులో సేంద్రియ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొం టున్నారు. హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్. దీనివలన భూసారంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుందని చెబుతున్నారు. రసాయన ఎరువుల ఖర్చులను ఆదా చేసుకుని అధిక దిగుబడులు సాధించి లాభాలు ఆర్జించవచ్చని సూచిస్తున్నారు. వచ్చే వేసవి బెండ సాగుకు అనుకూలమని, పంట సాగుకు అవలంబించాల్సిన పద్ధతులు ఆయన మాటల్లోనే..

వాతావరణం : వేడి వాతావరణం అనుకూలం. అతి చల్ల ని వాతావరణం పంట పెరుగుదలకు ప్రతికూలం. అందు వలన పంట వర్షాకాలం, వేసవికాలంలో పండించడానికి అనుకూలమైనది.

నేలలు : సారవంతమైన నీరు ఇంకే తేలికపాటి నేలలు, మురుగు నీటి సౌకర్యం గల తేలికపాటి రేగడి నేలలు అనుకూలం.

విత్తే సమయం : వర్షాకాలపు పంటకు జూన్ నుంచి జూలై వరకు, వేసవి పంటను జనవరి రెండవ పక్షం నుంచి ఫిబ్రవరి చివరి వరకు విత్తుకోవచ్చు.

విత్తన మోతాదు : వేసవి పంటకు ఎకరాలకు 7 నుంచి 8 కిలోల విత్తన సరిపోతుంది.

రకాలు : పర్బని క్రాంతి, అర్కఅనామిక, అభయ


విత్తన శుద్ధి

- విత్తనాలను విత్తే ముందు 12గంటలు నీటిలో నాన బెట్టాలి.
- ఆవు మూత్రం ద్రావణంలో (1:5 నిష్పత్తిలో నీటిలో కలిపి) 30 నిమిషాలు శుద్ధి చేయాలి.
- విత్తనశుద్ధికి 100 మి.లీ. ఆవు మూత్రం, 100 గ్రాములు ఆవు పేడ, 100 గ్రాములు గట్టుమట్టి, లేదా పుట్ట మట్టి కలిపిన నీటిలో ఒక గంట వరకు నానబెట్టి, నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.
- భీజామృతం లేదా అమృత జలం లేదా పంచగవ్యం ద్రావణంలో 8గంటలు నీటిలో నానబెట్టి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.

పొలం తయారీ, విత్తే పద్ధతి : నేలను 4–5 సార్లు బాగా దున్నాలి. వర్షాకాలపు పంటను 60 సెం.మీ ఎడంలో బోదెలపై 30 సెం.మీ దూరంలో విత్తుకోవాలి. నేలను మళ్లుగా చేసి, వరుసల మధ్య 45 సెం.మీ, మొక్కల మధ్య 15 నుంచి 20 సెం.మీ. దూరం ఉండేటట్లు విత్తుకోవాలి. ఒక్కో రంధ్రానికి 2–3 విత్తనాలను విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం :

- 10 నుంచి 15 మి.లీ. కోడిగుడ్లు, నిమ్మకాయ రసం ద్రావణాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి దిగుబడులు పెంచవచ్చు.
- మొక్కలు మొలిచిన 3–4 రోజుల్లో తొలిసారి 3 శాతం పంచగవ్య ద్రావణం పిచికారీ చేయాలి.



- పూత దశకు ముందే 5 శా తం పంచగవ్య పిచికారీ చేయాలి.
- పంట రెండు వారాల వయస్సులో 400 లీటర్ల జీవామృతం సాగు నీటిలో అందించాలి.
- మొక్క 4–6 ఆకుల దశలో తులసీ-కలబంద కషాయం పిచికారీ చేయాలి.
- పంటపై 2 శాతం పంచగవ్య పిచికారీ చేస్తే దిగుబడులు పెరుగుతాయి.

రక్షణ పంటలు : తోట చుట్టూ జొన్న, సజ్జ, బంతి మొక్కలను పెంచాలి.

అంతర పంటలు : పైరు మధ్యలో బంతి మొక్కలను ఎర పంటగా వేయాలి. అంతర పంటలుగా ముల్లంగి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, క్యాప్సికం, కొత్తిమీర సాగు చేసుకోవచ్చు.

నీటియాజమాన్యం : గింజలు విత్తిన వెంటనే నీరు కట్టాలి. తరువాత 4–5 రోజులకు రెండోసారి నీరు పారించాలి. వేసవి పంటకు అయితే ప్రతి 4–5 రోజులకు ఒకసారి తప్పనిసరిగా నీరు పెట్టాలి.

దిగుబడి : 7 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

భూసార యాజమాన్యం ఇలా..

- దబోల్కర్ పద్ధతిలో వివిధ రకాల విత్తనాలను విత్తి పెరిగిన తర్వాత భూమిలో కలియదున్నాలి.
- ఎకరానికి పశువుల ఎరువు 10 టన్నులు, 500 కిలోల ఘనజీవామృతం, వేప పిండి 100 కిలోలు, వేరుశనగ పిండి 32–40 కిలోలు, 2 కిలోలు అజోస్పైరిల్లం, 2 కిలోలు పాస్ఫోబ్యాక్టీరియా, ఆఖరి దుక్కిలో వేసి, కలియదున్నాలి.
- ఎకరానికి 200 లీటర్ల జీవామృతం, 15 రోజుల వ్యవధిలో సాగు నీటిలో అందించాలి.

మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి



సూర్యాపేట డీఐఈఓ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోనే ఇంటర్ మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో డీఐఈఓ కార్యాలయంలో డీఐఈఓ కృష్ణయ్యతో పాటు డీఈసీ సభ్యులకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్ష పేపర్ల మూల్యాకనం నల్లగొండకు వెళ్లి చేయాలంటే లెక్చరర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో లెక్చరర్స్ కర్నాటి శ్రీనివాస్, జి.సైదులు, జ్యోత్స్న, జి.శ్రీను, రాజయ్య, వాసు, వీరయ్య, జనార్దన్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పార్వతీపురంలో పంచాయతీ శిలాఫలకం ధ్వంసం

- భవనం పూర్తికాకుండానే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- ప్రారంభోత్సవ సమయానికి ధ్వంసం చేసిన దుండగులు
- కాంగ్రెస్ నాయకులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సర్పంచ్ ఫిర్యాదు
- అకారణంగా దూషించారని సర్పంచ్‌తో పాటు మరికొందరిపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



ముక్కలైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ తదితరులు

నిడమనూరు: నిడమనూరు మండలం పార్వతీపురం గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలాకాన్ని బుధవారం దుండగులు ధ్వంసం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022సంవత్సరంలో విడుదల చేసిన రూ.20లక్షల నిధులతో గ్రామంలో చేపట్టిన పంచాయతీ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం బుధవారంతో ముగియనుండడంతో శిలాఫలకంపై తన పేరు ఉండాలని సర్పంచ్ వంకా బ్రహ్మన్న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశాడు. ఇంకా పూర్తి కాని పంచాయతీ భవన ప్రారంభోత్సవాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. బుధవారం భవనం ప్రారంభోత్సవం చేసేందుకు సర్పంచ్ వచ్చే సరికి శిలాఫలకం ధ్వంసమై ఉంది. దీంతో సర్పంచ్ వంకా బ్రహ్మన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి పరిశీలించారు. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీలకు నిధులు విడుదల చేశామని, కాంగ్రెస్ వారు ఓర్చుకోలేకనే ఇలా శిలాఫలకాన్ని ధ్వంసం చేసారని ఆరోపించారు. శిలాఫలకాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు వేములపల్లి వెంకట్రావు, మద్దిపూడి రాంబాబు, కుంబం విజయ్, కంచి శ్రీను ధ్వంసం చేశారని అనుమానం వ్యక్తం చేస్తూ సర్పంచ్ బ్రహ్మన్న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా ఎందుకు ప్రారంభోత్సవం చేస్తున్నారని డిగితే దూషించారని స్థానిక కాంగ్రెస్ నాయకుడు వేములపల్లి వెంకట్రావు సర్పంచ్‌తో పాటు వంకా బ్రహ్మన్న, సత్యనారాయణ, నక్క సైదులు, కృష్ణమూర్తిపై మరో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

ఓర్వలేకనే శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు

గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. గ్రామంలో అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేకనే శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.

– వంకా బ్రహ్మన్న, సర్పంచ్, పార్వతీపురం

సమాచారం లేదు

పార్వతీపురం గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం గురించి అధికారికంగా సమాచారం లేదు. భవనం పూర్తి అయిన తర్వాత ప్రారంభిస్తాం. భవనం పూర్తయినట్లు కూడా సమాచారం అందలేదు.

– ప్రమోద్‌కుమార్, ఎంపీడీఓ, నిడమనూరు

బొట్టు..బొట్టు.. పంట చిగురించేట్టు



కన్నెకల్లులో స్ప్రింక్లర్లతో సాగు చేస్తున్న వేరుశనగ



గంధ్రవానిగూడెం శివారులో స్ప్రింక్లర్లతో సాగు చేస్తున్న కొత్తిమీర

మాడుగులపల్లి : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మాడుగులపల్లి మండలంలోని సాగర్ ఆయకట్టేతర ప్రాంత రైతులు బిందు, తుంపర సేద్యంపై దృష్టి సారించారు. డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకొని మెట్ట భూముల్లో పచ్చని పంటలు పండిస్తున్నారు. తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, వేరుశనగ తదితర పంటలను సాగు చేస్తున్నారు. మండలవ్యాప్తంగా 3 నుంచి 4 వేల ఎకరాల్లో వేరుశనగ, కొత్తమీర, దోస, ఇతర కూరగాయలు పండిస్తున్నట్లు మండల ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి తెలిపారు. ప్రభుత్వం బిందు, తుంపర సేద్యం పరికరాలు సబ్సిడీపై అందిస్తే మరింత మంది రైతులు ప్రత్యామ్నాయ పంట సాగు చేసి ఆదాయం గడించే అవకాశం ఉంది.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సంస్థాన్ నారాయణపురం: గ్రామాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అల్లందేవిచెర్వు గ్రామ నూతన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ సుర్వి యాదయ్యతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లకు సర్వాధికారులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బద్దం సునిత, వంటల గణేష్, ముక్కెర్ల స్వామి, గుండు రాజు, అండాలు, జయమ్మ, సర్పంచ్‌లు కొలను శ్రీనివాస్‌రెడ్డి, పోట్ల సత్యం తదితరులున్నారు.

కోలాహలంగా కబడ్డీ పోటీలు

మఠంపల్లి: కానుకమాత తిరునాళ్ల సందర్భంగా మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి మూడవ రోజు కోలాహలంగా కొనసాగాయి. పోటీల్లో 38జట్లు పాల్గొనగా ప్రస్తుతం సెమీఫైనల్ పోటీలు జరుగుతున్నాయని నిర్వాహకులు ఉత్సవకమిటీ అధ్యక్షుడు కొత్తపల్లిశౌరి తెలిపారు. గురువారం ఫైనల్ పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు దైదారాయలు, జయరాజు, ప్రసాదు, సైదులు, నాగరాజు, సందీప్, వీరాస్వామి, మట్టయ్య, బాబు, జోజి,అంజి, ఇమ్మానియేల్ తదితరులు ఉన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు